నిరీక్షణ ఫలించె.. కొలువు సాకారమయ్యే!

నేడు డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్ : ఉపాధ్యాయ కొలువు సాధించాలనే అభ్యర్థుల నిరీక్షణ ఫలించింది. ఎట్టకేలకు ప్రభుత్వం సోమవారం డీఎస్సీ ఫలితాలను విడుదల చేసింది. సబ్జెక్టు వారీగా ర్యాంకులను ప్రకటించింది. పలు పోస్టులకు సంబంధించి 1:3 పద్ధతిలో అభ్యర్థుల జాబితా రూపొందించింది. దీంతో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి నోచుకోనున్నాయి. జిల్లాలో మొత్తం 93 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలకు మోక్షం కలగనుంది. జిల్లాలో సోమవారం నుంచి అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో పలు చోట్ల సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో కొత్తగా ఉపాధ్యాయుల రాకతో బోధన గాడిలో పడనుంది.

పుణ్యక్షేత్రాలకు బస్సులు లేవు



మంథని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: మంథని మీదుగా వేములవాడ-కాళేశ్వరం పుణ్యక్షేత్రాలను కలుపుతూ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో వేములవాడ, మెట్‌పల్లి డిపోల నుంచి కరీంనగర్, మంథని మీదుగా కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సులు నడిచేవి. సిరిసిల్ల, వేములవాడల నుంచి కాళేశ్వరానికి, మంథని నుంచి వేములవాడలకు బస్సులను నడిపేవారు. ఈ సర్వీసుల ద్వారా భక్తులు తీర్థయాత్రలకు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా ఉండేది. కరోనా అనంతరం వీటిని నిలిపి వేయడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భక్తులు వాపోతున్నారు. పలు బస్సులను ఎక్కి.. దిగాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే వేములవాడ-కాళేశ్వరం మధ్య బస్సులను పునరుద్ధరించాలని కోరుతున్నారు. అలాగే మంథని నుంచి చెన్నూర్, మహారాష్ట్రలోని సిరొంచ బస్సులను పునరుద్ధరించాలని వేడుకుంటున్నారు.


బాహుబలులు.. గని వీరులు

కోల్ ఇండియా పోటీల్లో ఉద్యోగుల సత్తా

న్యూస్‌టుడే, గోదావరిఖని

క్రీడలపై ఆసక్తితో జాతీయస్థాయి పోటీల్లో సింగరేణి ఉద్యోగులు సత్తా చాటారు. ఒడిశాలోని ఐబీ వ్యాలీలో నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి పోటీల్లో పలువురు సింగరేణి ఉద్యోగులు బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించిన కోల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొన్న రామగుండం ప్రాంతానికి చెందినవారు.. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 11 బొగ్గు పరిశ్రమల క్రీడాకారులతో పోటీ పడ్డారు.

16 బంగారు పతకాలు..



ఆర్జీ-1 సివిల్ విభాగంలో ఫిట్టర్ రాజయ్య.. ఇప్పటివరకు కోల్ ఇండియాలో 24 పతకాలు సాధించారు. తాజాగా నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించారు. 89 కిలోల విభాగంలో 61 కిలోల స్నాచ్, 75 కిలోల క్లీన్‌జర్క్‌లో ప్రతిభ చాటారు. ఇప్పటివరకు మొత్తం 16 బంగారు, 5 వెండి, 3 రజత పతకాలు సాధించారు. రెండుసార్లు ఉత్తమ లిఫ్టర్‌గా, సింగరేణి స్ట్రాంగ్‌మెన్‌గా సైతం బిరుదులు అందుకున్నారు.

లిఫ్టింగ్.. అటు పరుగుపందెం



సింగరేణి ఆర్జీ-3 విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మమత.. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 47 కిలోల విభాగంలో పోటీపడి.. వెండి పతకాన్ని అందుకున్నారు. 55 కిలోల స్క్వాట్, 28 కిలోల బెంచ్, 65 కిలోల డెడ్ స్థాయిలో బరువులు ఎత్తారు. గతంలో నిర్వహించిన కోల్ ఇండియా పోటీల్లో 4004 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించారు.

వరుసగా రెండోసారి..



సింగరేణి ఉద్యోగి సాయిలత వరుసగా రెండోసారి పతకం సాధించారు. గతేడాది పవర్ లిఫ్టింగ్‌లో వెండి పతకం కైవసం చేసుకోగా.. తాజాగా బంగారు పతకం దక్కించుకున్నారు. సాయిలత 84 కిలోల విభాగంలో పోటీపడ్డారు. సింగరేణిలో రెండుసార్లు మొదటి స్థానం సాధించి కోల్ ఇండియా పోటీలకు ఎంపిక కావడంతో.. పలువురికి ఆదర్శంగా నిలిచారు.

బహుమతి తీసుకుంటున్న సాయిలత

109 కిలోల విభాగంలో..



ఆర్జీ-2లో జనరల్ మజ్దూర్ రాఘవ రెడ్డి.. రెండోసారి కోల్ ఇండియాలో సత్తా చాటారు. తాజాగా నిర్వహించిన పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించారు. గతేడాది వెండి పతకం కైవసం చేసుకున్నారు. 109 కిలోల విభాగంలో పోటీపడి 55 కిలోల స్క్వాట్, 28 కిలోల బెంచ్, 65 కిలోల డెడ్ వెయిట్‌ను ఎత్తి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు.

కార్మికుల కనీస వేతన జీవోల సవరణకు డిమాండ్



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కార్మికుల కనీస వేతన జీవోలను సవరించాలని కలెక్టరేట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముత్యంరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల సలహా మండలి ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల్లో కార్మికుల ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. రామగుండం ప్రాంతంలో కార్మికుల కోసం 100 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని నినదించారు. రైసుమిల్లుల కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ బీమా వర్తింపజేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార స్వామి, నాయకులు భిక్షపతి, సీపెల్లి రవీందర్, రామాచారి, అంజయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలో బాలికలు

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ఎలిగేడు మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బాలికల అండర్-14 విభాగంలో సుల్తానాబాద్ ప్రథమం, రామగుండం ద్వితీయ, అండర్-17 విభాగంలో సుల్తానాబాద్ ప్రథమం, పెద్దపల్లి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర అండర్-14 విభాగంలో మంథని ప్రథమం, రామగుండం ద్వితీయ, అండర్-17లో మంథని ప్రథమం, సుల్తానాబాద్ జట్లు ద్వితీయ స్థానంలో నిలిచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. విజేత జట్లకు ఎమ్మెల్యే విజయరమణారావు బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా పోటీలను జిల్లా విద్యాధికారిణి మాధవి ప్రారంభించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎంఈవో కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవేందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు

- 311 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- 4.36 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం



ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు(పాతచిత్రం)

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

జిల్లా యంత్రాంగం వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు వేస్తోంది. వరి కోతలు ప్రారంభం కాగానే ప్రారంభించాలని యోచిస్తోంది. ఇందుకోసం 311 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ సీజన్‌లో 4.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తుండగా.. 4.36 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్లే లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే నిబంధనల పేరిట మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీల పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలి. ప్రతి ఏడాది అన్నదాతల ధాన్యపురాశులకు భారీగా కోతలు విధిస్తూ వారు సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు.

కోటి గన్నీ సంచులకు.. 23 లక్షలే అందుబాటులో..

జిల్లాలో గతేడాది కంటే వరి సాగు ఈ ఏడాది స్వల్పంగానే సాగైంది. ఈ సంవత్సరం 2.02 లక్షల ఎకరాల్లో అన్నదాతలు వరి వేశారు. 311 కొనుగోలు కేంద్రాల ప్రతిపాదనల్లో 60 సెర్ప్, 251 సహకార శాఖ కేంద్రాలు ఉన్నాయి. సేకరణలో జాప్యం లేకుండా ఊరికొక కేంద్రాన్ని నెలకొల్పాలని ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం క్వింటా ఏ గ్రేడ్ వడ్లకు రూ.2,320 కామన్‌గ్రేడ్ వడ్లకు రూ.2,300 ధర చెల్లించనుంది. గతేడాది కంటే మద్దతు ధర రూ.117 పెరిగింది. 10,368 టార్పాలిన్లు అందుబాటులో ఉండగా.. మరో 10 వేల వరకు అవసరం ఉంది. తేమశాతం కొలిచే పరికరాలు 1,090, ప్యాడీ క్లీనర్లు 586 ఉన్నాయి. కోటి గన్నీ సంచులు అవసరం కాగా.. 23.01 లక్షలు మాత్రమే ఉన్నాయి.

అధికారులు దృష్టి పెట్టాల్సిన అంశాలు

- మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులు క్వింటాకు తరుగు పేరిట 2-4 కిలోల చొప్పున కోతలు విధిస్తున్నారు.
- తేమ శాతం, ఇతర నిబంధనలకు అనుగుణంగా ఉన్నప్పటికి కొనుగోలులో తాత్సారం చేస్తున్నారు.
- గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి.. రైతులకు గుండెకోత మిగులుతోంది.
- హమాలీలు, లారీల సమస్యతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు.

సన్నధాన్యానికి రూ.500 బోనస్

జిల్లాలో వానాకాలం ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా ప్రణాళిక రూపొందిస్తున్నాం. రైతులు వచ్చిన తర్వాతనే కేంద్రాలకు తీసుకురావాలి. ఈసారి సన్నధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తాం. ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నాం. పలు శాఖల సమన్వయం తీసుకుంటున్నాం.

-శ్యామ్‌ప్రసాద్ లాల్, అదనపు పాలనాధికారి

రైతేరాజు 8లో

దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలి



బాధితుల సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా సమీకృత పాలనా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు పాలనాధికారులు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీరికి ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఫిర్యాదు రూపంలో విన్నవించారు. అనంతరం అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని చెప్పారు. కలెక్టర్ శ్రీహర్ష అధికారిక పర్యటనలో ఉండటంతో ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో కొందరు ఆయన కోసం వేచి చూసి ఫిర్యాదు చేయకుండానే వెనుదిరిగారు.

కారణం లేకుండానే సరెండర్ చేశారు



రామగుండం వైద్య కళాశాలలో వారధి సొసైటీ ద్వారా కంప్యూటర్ ఆపరేటర్‌గా నియామకమయ్యా. రెండేళ్లుగా విధులు నిర్వహిస్తుండగా.. కారణం లేకుండానే కళాశాల ప్రిన్సిపల్ వారధికి సరెండర్ చేశారు. ఇప్పటికి ఒక సారి ప్రజావాణిలో ఫిర్యాదు చేశా. ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలి.

- రాజేందర్, బాధితుడు, గోదావరిఖని

పదోన్నతితో మరింత బాధ్యత



పదోన్నతి పొందిన పోలీసులతో సీపీ శ్రీనివాస్

గోదావరిఖని, న్యూస్‌టుడే: పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో పదోన్నతి పొందిన ఆరుగురికి ఎస్సై చిహ్నం అలంకరించారు. మరోవైపు పోలీసు శాఖలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన వారిని సీపీ సన్మానించారు. ఎలాంటి సమస్య ఉన్న శాఖ నుంచి సేవలందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ రాజు, ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

6,903 కేసుల పరిష్కారం

గోదావరిఖని: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో 6,903 కేసులు పరిష్కారమయ్యాయని సీపీ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకునే కేసుల్లో ఉన్న కక్షిదారులకు అవగాహన కల్పించామన్నారు. 66 సైబర్ క్రైం కేసుల్లో రూ.17,01,816 నగదును రికవరీ చేశామన్నారు.

ఒక్కేసి పువ్వేసి.. బతుకమ్మ పేర్చి



బతుకమ్మలతో కళాశాల విద్యార్థినులు

జ్యోతినగర్(మార్కండేయ కాలనీ): ఎన్టీపీసీలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మను పూలతో అందంగా పేర్చి విద్యార్థులు ఆడిపాడారు. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మంథని మండలం అడవిసోమన్‌పల్లి గ్రామం వద్ద సోమవారం మానేరు వాగుపై ఉన్న వంతెన రెయిలింగ్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

-న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

హర హర మహాదేవ



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి సోమవారం భక్తుల తాకిడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు కుటుంబ సమేతంగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు పరిశీలించారు. దాదాపు 25 వేల మంది దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

తరచూ తిందాం.. ఆరోగ్యంగా ఉందాం!

- జీవనశైలికి మేలు చేసే కూరగాయలు
- నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం

ఈనాడు, కరీంనగర్

మారుతున్న జీవనశైలిలో శాకాహారం ప్రాధాన్యం పెరుగుతోంది. దరిచేరుతున్న రుగ్మతల కారణంగా కొందరు.. వైద్యులు సూచిస్తున్నారని మరికొందరు.. శాకాహార ప్రియులుగా మారిపోతుండగా.. అప్పుడప్పుడు మాత్రమే మాంసాహారం తీసుకుంటూ వారంలో వీలైనన్ని ఎక్కువ రోజులు శాకాహార రుచిని మరికొందరు ఆస్వాదిస్తున్నారు. నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం సందర్భంగా కథనం.



ప్రయోజనాలనేకం..

- బీన్స్, కూరగాయలు, పప్పులు, బఠాణీలు తీసుకోవడం వల్ల శరీరానికి పొటాషియం, ఐరన్, పీచు సమృద్ధిగా అందుతుంది.
- మంచి బ్యాక్టీరియాపై కూరగాయలు సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- తక్కువ కొవ్వు ఉండే వాటిని తినడం వల్ల మధుమేహం తగ్గుతుంది. పీచు పదార్థాలను తీసుకుంటే ఇన్సులిన్ ఉత్పత్తి మెరుగవుతుంది.
- శాకాహారంతో మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మాంసం వల్ల అరాకిడోనిన్ యాసిడ్ ఉత్పత్తి అయి మానసిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది.
- ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన పీచు పదార్థాలు, పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్ మినరల్స్ శరీరానికి చేరుతాయి.

ఇది నిజమేనండోయ్..!

- ప్రతి రోజు భోజనంలో పండ్లు, కూరగాయలు తీసుకున్న వారి కంటే.. వీటిని తీసుకోని వారిలో 30 శాతం హృదయ సంబంధ జబ్బులుంటున్నాయట.!
- శాకాహారం సరిగ్గా తినని 26-30 ఏళ్ల మధ్య వయసున్న యువకుల్లో కొవ్వు స్థాయికి మించి ఉంటుందని.. హృద్రోగ సమస్యలు అధికమని వైద్యులు చెబుతున్నారు.
- రోజులో 8 శాతం పండ్లు, ఆకుకూరలు తీసుకోవాల్సిన చోట గరిష్ఠంగా 1.5 శాతాన్ని కూడా మించకపోవడంతో పోషకాలు సరిగ్గా అందడం లేదు.
- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సర్వే ప్రకారం ప్రతిరోజు తినే ఆహారంలో 20 శాతం పీచు పదార్థాలు తప్పకుండా ఉండాలి.
- యువతుల్లో ఐరన్ లోపాన్ని అధిగమించేందుకు రోజూ ఆకుకూరల్ని తీసుకోవడంతో మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.
- ఎరుపు, పసుపు, ఆరెంజ్ రంగుల్లో ఉండే కాయగూరలతో యాంటీఆక్సిడెంట్‌లు ఎక్కువగా అందుతాయి. దీంతో ఆరోగ్యం మెరుగవుతుంది.

సాగు తగ్గి.. దిగుమతి భారం

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. దశాబ్దం కిందటితో పోలిస్తే జిల్లాలో ఉత్పత్తి తగ్గింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వీటిని దిగుమతి చేసుకుంటుండటంతో వీటి ధరలు నింగిని తాకుతున్నాయి. కూరగాయలకు ప్రోత్సాహకాలు తగ్గడం, రాయితీ విత్తనాల సరఫరా, సరైన మార్కెటింగ్ లేక రైతులు సాగుకు విముఖత చూపిస్తున్నారు. 2016లో 6300 హెక్టార్లలో సాగైన సాగు.. ఇప్పుడు 1600కు పైగా హెక్టార్లకు పడిపోయింది. అన్నిరకాల కూరగాయలు కలిపి ప్రతి వ్యక్తి రోజులో 300 గ్రాములను ఆహారంగా తీసుకోవాలి. ఇలా ఏడాదికి 109.5 కిలోలవసరం. 38 లక్షల జనాభా ఉన్న జిల్లాలో 4.14 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలవసరం. ప్రస్తుత ఉత్పత్తి ఏడాదిలో సగం కూడా ఉండటం లేదు. ఈ లోటునంతా పూరించేందుకు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు వచ్చే విధంగా కూరగాయలు ప్రజలకు జిల్లాలోనే అందేవిధంగా చొరవ చూపాలి.



పోషకాల లోపం ఉండదు..



నేడు ఫాస్ట్ ఫుడ్, మాంసాహార వినియోగం పెరగడంతో చాలామందిలో పోషకాల లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో అధికంగా ఈ సమస్య ఉంది. ఆకు కూరలు, కూరగాయల ద్వారా చాలా పోషకాలు అందుతాయి. అన్ని వయసుల వారు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. తాజా ఆకుకూరలు, కాయగూరలతో జీర్ణక్రియ మెరుగవుతుంది. తృణధాన్యాలు, మొలకెత్తిన విత్తనాల వల్ల కూడా పోషకాలు దండిగా అందుతాయి.

- డాక్టర్ ఎం.సాయిప్రియ, న్యూట్రిషియన్, కరీంనగర్

అట్రాసిటీ కేసులపై పోలీసుల నిర్లక్ష్యం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో గోదావరిఖని పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బాపయ్య ఆరోపించారు. పట్టణంలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. దళితులు ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు స్పందించడం లేదని వాపోయారు. ఇటీవల కోరె శంకర్ ఇచ్చిన ఫిర్యాదుపై నిర్లక్ష్యం చేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. దీంతో దళితులకు న్యాయం జరగడంలేదని.. పోలీసు ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

2న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 2న అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టయ్య వెల్లడించారు. ఆసక్తి గలవారు వయస్సు, పదో తరగతి ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. ఇతర వివరాలకు చరవాణి నంబర్ 94404 24640 సంప్రదించాలన్నారు.

తెగుళ్ల తరుణం.. యాజమాన్యం కీలకం

పైర్లలో సమస్యలు, నివారణపై జగిత్యాల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. - న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

రైతేరాజు


వరి: దుబ్బుచేసే దశలోని వరిపైరుపై చాలాప్రాంతాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించింది. ఆకులపై పసుపురంగు మచ్చలేర్పడి అంచుల నుంచి కిందకు వ్యాపిస్తాయి. తెగులు 5 శాతం కన్నా ఎక్కువైతే నత్రజని వేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులాశించిన పొలం నుంచి నీటిని రెండుసార్లు పూర్తిగా బయటకు పంపాలి. లీటరు నీటికి అగ్రిమైసిన్ 0.4 గ్రాములు లేదా ప్లాంటామైసిన్ లేదా పోషామైసిన్ మందు ద్రావణాన్ని 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పైరుపై పిచికారీ చేయాలి. ఈనిక దశలోని పైరుపై మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ మందు 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పలుచోట్ల కనిపిస్తున్న జింకు ధాతువు లోప నివారణకు 2 గ్రాముల జింకుసల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారీ చేయాలి. జింకు సల్ఫేట్‌లో పురుగు, తెగుళ్లమందును కలపకూడదు. అగ్గితెగులు వ్యాపిస్తున్నందున 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథయోలిన్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



మొక్కజొన్న: ఆలస్యంగా విత్తిన మక్కల్లో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిమ్ బెంజోయేట్ 0.4 గ్రాముల మందును లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మోకాలి దశదాటి పైరులో కత్తెర పురుగును గుర్తిస్తే 9 కిలోల ఇసుకకు ఒక కిలో సున్నాన్ని కలిపిన మిశ్రమాన్ని మొక్కజొన్న కర్రల మొగిలో వేసుకోవాలి. ఎర్వినియా ఎండుతెగులు నిరోధానికి 100 కిలోల వేపపిండికి 4 కిలోల బ్లీచింగ్ పౌడర్‌ను కలిపి పొలమంతా చల్లాలి. మక్కల్లో తేమ ఎక్కువ తక్కువైనా పోషకాలను గ్రహించలేవు. ఈ సమయంలో యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపిగాని డీఏపీ 1-2 గ్రాములు లేదా 19-19-19 మందును 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూతదశలో ఎకరాకు 50 కిలోల యూరియా చొప్పున వేసుకోవాలి.



పత్తి : రసంపీల్చు పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నందున మోనోక్రోటోఫాస్, నీటిని 1:4 నిష్పత్తిలో లేదా ఇమిడాక్లోప్రిడ్, నీటిని 1:20 నిష్పత్తిలో కలుపుకొని కాండానికి పూత పద్ధతిని ఆచరించాలి. పత్తి పూత దశలో 2 శాతం యూరియాను మొక్కలపై పిచికారీ చేయాలి. పత్తి మొక్కలు ఎండిపోవటం గమనించిన చోట 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బండిజం, మాంకోజెబ్‌ను లీటరు నీటికి వంతున కలిపి 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు మొక్కల అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలి.



సాగులో రైతుల సందేహాలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యాన శాస్త్రవేత్త జి.వేణుగోపాల్ నివృత్తి చేశారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



? టమాట సాగులో ఆకు మాడు తెగులు వస్తుంది. - రాజమల్లు, రామన్నపల్లి

✓ టమాట నారు నాటిన పది రోజుల నుంచి ఆకులపై మచ్చలు మొదలై 30 రోజులకు ఎండే స్థాయికి వస్తుంది. నివారణకు మెటీరాం, పైరాక్లోస్ట్రోబిన్ కలగలిసిన మందును లీటరు నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? బీరతోటలో ఆకులపై తెల్లని బూజుమచ్చలు కన్పిస్తున్నాయి. - మహేందర్, మొత్కులగూడెం

✓ మైక్లోబ్యూటానిక్ మందును లీటరు నీటికి 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, జమ్మికుంట**

సేంద్రియ విధానంలో సాగా?

మీకు తెలుసా?

సేంద్రియ విధానంలో కూరగాయల సాగు చేపట్టే వారు నేలలో పశువుల, కోళ్ల, జీవాల ఎరువు, లేదా వర్మికంపోస్టును వేసి కలియదున్నాలి. వేపపిండి, వేరుసెనగపిండి, ఆముదపు పిండి తదితరాలు వాడవచ్చు. పంటమార్పిడి పాటించాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, ఫాస్ఫోబాక్టీరియాను వినియోగించవచ్చు. రసాయనాలను వాడకుండా సహజ సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

నాటుకోళ్ల ఫారం.. యువరైతు ఆదర్శం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

అందరిలా మూసధోరణిలో పంటల సాగు చేపట్టకుండా వినూత్న ఆలోచనతో యువరైతు ముందుకెళ్తున్నాడు. కోళ్ల ఫారం నిర్వహించడానికి శ్రీకారం చుట్టి లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.



30 గుంటల్లో ఫారం : మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన ఉత్తమ ఆదర్శ రైతు రాజారపు భూమేశ్వర్ తనయుడు రాజారపు ప్రతీక్.. డిగ్రీ వరకు చదువుకున్నాడు. నాటుకోళ్ల పరిశ్రమ నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. గ్రామ శివారులోని వారికి ఉన్న 7 ఎకరాల్లో సుమారు 30 గుంటల భూమిని ఎంపిక చేసుకొని 2021లో నాటుకోళ్ల ఫారాన్ని ఏర్పాటు చేశాడు. వరంగల్ నుంచి ఒక్కో కోడి పిల్లకు రూ.35ల చొప్పున చెల్లిస్తూ నాలుగు నెలలకోసారి 500 వరకు తీసుకొస్తున్నాడు. రెండు నెలల వరకు వాటికి కావాల్సిన దాణాను అందిస్తూ నాటుకోళ్లను విక్రయిస్తున్నాడు.

భలే డిమాండ్ : హోటళ్లతోపాటు చికెన్ సెంటర్ల యజమానులు నేరుగా ఫారం వద్దకే చేరుకుని నాటుకోళ్లను కొనుగోలు చేస్తున్నారు. బయట కిలోకు రూ.550 నుంచి రూ.600ల వరకు ధర ఉంటోంది కానీ.. ఫారం వద్ద రూ.400లోపే ఇస్తుండటంతో చాలా ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తున్నారు. 4 నుంచి 5 నెలలకోసారి సుమారుగా రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుండగా.. పెట్టుబడి రూ.80 వేలుపోను రూ.1.20 లక్షల లాభం మిగులుతోంది. నిత్యం ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున నాటుకోళ్లను చూసుకుంటూ మిగతా సమయంలో తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తుంటానని.. ప్రస్తుతం కోళ్లఫారంపై లాభాలు వస్తున్నందున సంతోషంగా ఉందని తెలిపాడు ప్రతీక్.

బాధ్యత గుర్తిద్దాం.. భరోసానిద్దాం!

నేడు ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



న్యూస్‌టుడే, కరీంనగర్ మంకమ్మతోట

ఒకప్పుడు ఇంట్లో పెద్ద మనిషి ఉంటేనే అనుకునే వారు. జీవితంలో వారి అనుభవానికి ప్రాధాన్యమిచ్చే వారు. ఏదైనా సలహా అవసరమైతే వారినే సంప్రదించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి మారింది. వారిని భారంగా భావిస్తున్నారు. వయసు మీద పడిన తల్లిదండ్రులను వేరుగా ఉంచుతున్నారు. లేదా ఆశ్రమంలో చేర్పిస్తున్నారు. దిక్కుమొక్కులేని వారిని ప్రభుత్వ ఆశ్రమాలు చేరదీస్తున్నాయి. వృద్ధాప్యం అనేది సామాజిక సమస్యగా మారడంతో భారత ప్రభుత్వం వృద్ధుల సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ దానిని అమలు చేయాల్సిన అధికారుల ఉదాసీన వైఖరితో వారికి భరోసా కరవైంది. మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాధ్యతను గుర్తించి.. వారికి భరోసా ఇవ్వాలని సూచిస్తూ ప్రత్యేక కథనం.



కరీంనగర్ ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు

టోల్‌ఫ్రీ నంబర్.. 14567

వృద్ధులు ఎలాంటి ఆపదలో ఉన్నా.. 14567 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించవచ్చు. వారు ఆపదలో ఉన్నట్లైతే సురక్షిత ప్రాంతానికి తరలించడానికి వాహన సౌకర్యం సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవలందించేందుకు ఒక వాహనం కరీంనగర్ జిల్లాలో అందుబాటులో ఉంది.

ఒకే వేదికపై కలుసుకునేలా..

జిల్లా కేంద్రంలో రెండేళ్ల కిందట డేకేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. వారందరు కలిసి మాట్లాడుకోవడానికి సమావేశ గది, దినపత్రికలు, ఫిజియోథెరపీ లాంటి సౌకర్యం కల్పించారు. పలువురు వృద్ధులు ప్రతి రోజు సమూహంగా కలిసి ఒంటరితనం లేకుండా ఆహ్లాద వాతావరణంలో ఉండే అవకాశం దక్కింది.

చట్టం ఏం చెబుతుందంటే...

భారత ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన వారిని ట్రిబ్యునల్‌లో విచారించి, న్యాయం చేయాలి. వారు జీవించడానికి భృతి ఇప్పించాలి. ట్రిబ్యునల్ ఆదేశాలను బేఖాతర్ చేస్తే కలెక్టర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలి. అనాథలు, ఆదరణకు నోచుకొని వృద్ధులు జీవించడానికి వారిని అనాథాశ్రమాల్లో చేర్పించాలి. వారు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. పోలీసులను ఆశ్రయించిన వారికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. కానీ క్షేత్ర స్థాయిలో సరిగా అమలు కావడంలేదు.


పెరుగుతున్న ఆశ్రమాలు..

గతంలో వృద్ధాశ్రమాల్లో అనాథలు మాత్రమే కనిపించేవారు. వివిధ కారణాలతో కొందరు ఆశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి, పదవీ విరమణ పొంది పింఛన్ పొందుతున్న వారికి మాత్రం చాలా చోట్ల కుటుంబాల్లో ఆదరణ లభిస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆశ్రమంతోపాటు మరో 13 వృద్ధాశ్రమాలు ఉన్నాయి. ఇప్పుడు తమ తల్లిదండ్రులను చూడకుంటే.. భవిష్యత్తులో తమకూ అదే పరిస్థితి వస్తుందని భావించి బాధ్యతగా మెలగాలి.

సమస్యలతో సహవాసం..

రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల తర్వాత ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమం కరీంనగర్‌లోనే ఉంది. ఇక్కడ 30 మంది వృద్ధులు, మరో 30 మంది దివ్యాంగులకు చోటు కల్పిస్తున్నారు. యాభై ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆశ్రమం కావడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సౌకర్యాలూ అంతంత మాత్రమే. పలుమార్లు పర్యటించిన రాష్ట్ర దివ్యాంగుల శాఖ డైరెక్టర్ సైతం నూతన భవనం నిర్మించాలని సూచించినా అడుగు ముందుకు పడట్లేదు. వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమాన్ని 20 ఏళ్లుగా వీరమాధవ్ స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. మిగిలిన ఆశ్రమాలు సౌకర్యాల కల్పనను బట్టి రుసుములు తీసుకుంటున్నాయి.

ఇరవై ఏళ్లుగా ఉంటున్నా..



నా పేరు కొండయ్య. వయసు 80 ఏళ్లు. కరీంనగర్ మండలం ఖాజీపురం మా ఊరు. సంతానం లేక, బంధువులు దరికి రానివ్వకపోవడంతో ఇరవై ఏళ్ల కిందట ప్రభుత్వ ఆశ్రమంలో చేరాను. అప్పటి నుంచి ఇక్కడే నా జీవితం, ఆశ్రమంలో మరిన్ని వసతులు కల్పించాలి.

చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

రక్షణకు చట్టాలు అమలులో తాత్సారం జరుగుతుంది. చట్ట ప్రకారం న్యాయం జరగట్లేదు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. చట్టం అమలుకు సంబంధిత అధికారులందరు సహకరించాలి. **- సముద్రాల జనార్దన్‌రావు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు**

నిరాదరణకు గురైన వారికి న్యాయం

వయోవృద్ధుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆపదలో ఉన్న వారి సమాచారం తెలవగానే వారిని సురక్షిత స్థలానికి చేర్చి, అవసరమైన చర్యలు చేపడుతున్నాం. నిరాదరణకు గురైన వారికి న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

బంధువులు పట్టించుకోలేదు..



మాది పెద్దపల్లి జిల్లా. నా పేరు నర్సమ్మ. కొన్నేళ్ల కిందటనే భర్త మరణించాడు. పిల్లలు లేరు. బంధువులు పట్టించుకోలేదు. తప్పని పరిస్థితుల్లో మూడేళ్ల కిందట కరీంనగర్ ప్రభుత్వ ఆశ్రమంలో చేరాను. నాలాంటి దిక్కులేని వారికి ఆసరా నిలవడానికి మరిన్ని ఆశ్రమాలు అవసరం.

హ్యాండ్‌బాల్ జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలు

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ మహిళలు, పురుషుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలను జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ మోడెం సురేష్‌లు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9 నుంచి 11 వరకు రంగారెడ్డిలో జరిగే 53వ రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బి.లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేష్, మల్లేశ్, సురేందర్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

భారాస నేతల మొసలి కన్నీరు

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

కరీంనగర్ పట్టణం, మానకొండూర్, న్యూస్‌టుడే : పదేళ్లపాటు పాలన చేసి తెలంగాణను విధ్వంసం చేసిన భారాస నేతలు ప్రస్తుతం అక్రమ కట్టడాలు కూల్చివేస్తుంటే మొసలి కన్నీరు కారుస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో చెరువు మధ్యలో కొందరు అక్రమంగా భవనాలు నిర్మించారని, వీటితో పట్టణాలు నీటిలో మునిగాయని.. ఖమ్మం, మహబూబాబాద్‌లలో ఇటీవల వచ్చిన వరదలకు ఇలాంటి నిర్మాణాలే కారణమని అన్నారు. గత భారాస ప్రభుత్వం కామారెడ్డి వెళ్లే దారిలో చెరువులోనే రెండు పడక గదుల ఇళ్లను కట్టిందని ఆరోపించారు. మధ్య మానేరు, మల్లన్నసాగర్ జలాశయాల నిర్మాణ సమయంలో గత ప్రభుత్వం స్థానికులను ఎంత బలవంతంగా ఖాళీ చేయించిందో అందరికి తెలుసని అన్నారు. ప్రస్తుతం హరీశ్‌రావు, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోతున్న పేదలకు మాత్రం స్థిర నివాసం కల్పిస్తామని, పేదల డిమాండ్లను సీఎం వింటారని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క కరీంనగర్ అతిథిగృహంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్లు, అధికారులు వారంలో 2, 3 రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విధులపై అలసత్వం వహిస్తే ఉపేక్షించేదీ లేదని తెలిపారు. 2 నుంచి బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ పుస్తకాలను ఆవిష్కరించారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రామచంద్రన్, కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, కోయ హర్ష, సందీప్ కుమార్‌ఝా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో అంగన్‌వాడీ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణ, అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ కోదండరాం

తెలంగాణచౌక్(కరీంనగర్), న్యూస్‌టుడే: ఎక్కడికి వెళ్లినా సమస్యలపై విజ్ఞాపనలు అందుతున్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు ప్రజా గొంతుకగా మారుతానని ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం అన్నారు. సోమవారం కరీంనగర్‌లో జనసమితి ఆధ్వర్యంలో ప్రెస్‌భవన్‌లో కోదండరాం పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఇప్పుడిప్పుడే ప్రజాస్వామ్య వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని ఆరోపించారు. కరీంనగర్‌లో పాత్రికేయులకు ఇచ్చిన నివేశన స్థలాలకు సంబంధించి ఎన్‌వోసీ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం పలు సంఘాల నేతలు ఎమ్మెల్సీని సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, జనసమితి రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు నరహరి జగ్గారెడ్డి, మాసం రత్నాకర్, గోపాల్‌రెడ్డి, జక్కోజు వెంకటేశ్వర్లు, బి.వెంకటమల్లయ్య, మార్వాడి సుదర్శన్, రమణారెడ్డి, ఫయాజ్, జునేద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, సంఘాల ప్రతినిధులు

సమాజ హితులు.. ప్రాణదాతలు

నేడు స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

కృత్రిమంగా సృష్టించలేనిది రక్తం. అందుకే అవసరార్థులకు దానం చేయడం మినహా మరో దారి లేదు. కొందరు కుటుంబ, బంధువర్గాలకు ఇచ్చేందుకు ముందుకొస్తారు. మరికొందరు సామాజిక బాధ్యతతో అవసరమున్న వారికి ఇస్తారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజంలో ఆపద సమయంలో ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకుంటున్నారు కొందరు. మంగళవారం 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' సందర్భంగా కథనం.



రక్తదానం చేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు..

రక్తం ఇచ్చే క్రమంలో సూదులకు, నొప్పులకు భయపడటంతోపాటు బలహీనమవుతామని కొందరు భావిస్తారు. ఈ అపోహలు తొలగించేందుకు వాలంటీర్లు కృషి చేస్తున్నారు. ప్రత్యేక శిబిరాలూ నిర్వహిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ప్రత్యక్షంగా దానం చేస్తారు. రోడ్డు ప్రమాదాలు, శస్త్రచికిత్స, హింసాత్మక ఘటనల సమయంలో రక్తం అవసరమవుతుంది. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న యువత ఏడాదిలో ఒకటి రెండు సార్లు దానం చేయడం మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు, యువజన సంఘాలు, సినీ హీరో అభిమాన సంఘాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి అవసరార్థులకు హితోధికంగా సహాయపడుతున్నారు.

ఈ రోజే ఎందుకంటే..


రక్తనిధి కేంద్రం సంఘం ఏర్పాటుతోపాటు ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యునోహెమటాలజీ స్థాపించి డాక్టర్ జై గోపాల్ జోలీ విశేష సేవలందించారు. ఆయన అక్టోబరు ఒకటిన జన్మించడంతో ఏటా ఆ రోజు 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. మన దేశంలో రక్తం కొరతతోపాటు సరిపోయే విధంగా నిల్వ కేంద్రాలు లేవు. ఆరోగ్యవంతుల్లో అపోహలను తొలగించి.. వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా ప్రేరణ కల్గించే విధంగా అక్టోబరు ఒకటిన ఈ దినోత్సవం నిర్వహిస్తారు.

ముఖ్యాంశాలు కొన్ని...

- రక్తదానంలో విధిగా డిస్పోజబుల్ నీడిల్స్ వాడాలి.
- కరీంనగర్‌లో 8 రక్త కేంద్రాలు ఉన్నాయి. ఇందులో వెయ్యి లీటర్లు వివిధ గ్రూపు రక్తం అందుబాటులో ఉంది.
- వివిధ స్వచ్ఛంద గ్రూపులలో దాదాపు 3 వేల మంది రక్తదాన వాలంటీర్లు ఉన్నట్లు అంచనా.
- కొందరు జన్మదినాలను పురస్కరించుకొని.. నిల్వ కేంద్రాలకు స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేస్తుంటారు.
- దాతకు పరీక్షలు జరిపిన తర్వాతనే రక్తం సేకరిస్తారు.
- ఆరోగ్యవంతులై 18-60 ఏళ్ల వారు.. 45 కిలోలకు పైగా బరువు ఉన్నవారు మాత్రమే ఇవ్వాలి.
- ప్రతి మూడు మాసాలకు ఒకసారి 350 మిల్లీలీటర్లు ఇవ్వొచ్చు.
- స్వచ్ఛంద రక్తదాతలో ఎలాంటి వ్యాధులు, రుగ్మతలు ఉండకూడదు. (రేబిస్, క్యాన్సర్, బీపీ, మధుమేహం, క్షయ, హెచ్ఐవీ, సుఖవ్యాధులు ఉండరాదు)
- కొన్ని యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సినీ హీరోల అభిమాన సంఘాల ప్రతినిధులు వాట్సప్ గ్రూపుల సమాచారంతో స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు.

65 సార్లు ఇచ్చా..

అవసరార్థులకు, రక్తదాన శిబిరాల్లో ఇప్పటి వరకు 65 సార్లు రక్తదానం చేశాను. నాది 'ఓ పాజిటివ్(విశ్వదాత)' గ్రూప్ కావడంతో తరచూ ఇస్తుంటాను. 1991 నుంచి ఏటా కనీసం రెండు, మూడు సార్లు ఇస్తున్నా. 1997 నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యుడిగా కొనసాగుతున్నా. మూడు సార్లు రాష్ట్ర గవర్నర్ నుంచి, 2023లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నా.



- వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ

అరుదైన గ్రూప్..

నాది అరుదైన 'బి నెగటివ్' గ్రూప్. అత్యవసర పరిస్థితుల్లో చాలా సార్లు రక్తదానం చేశా. ఆ రోగి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వాళ్లు వచ్చిన కృతజ్ఞతలు చెప్పినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. ఒక విధమైన సంతృప్తి కల్గుతుంది.



- ముస్కు సంతోష్‌రెడ్డి, ప్రైవేటు టీచర్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

? ఎన్టీపీసీ బాలాజీ స్వీట్ హౌస్ రోడ్డులో మార్గబిలం పైకప్పు కుంగిపోయింది. ప్రమాదం పొంచి ఉంది. వెంటనే మరమ్మతులు చేయించాలి. - **వేణుగోపాల్‌రెడ్డి.**

✔ వెంటనే ఇంజినీరింగ్ సిబ్బందిని పంపించి అవసరమైన మరమ్మతులు చేయిస్తాం. - **జమీల్, రామగుండం నగరపాలక డీఈ.**

? ఎన్టీపీసీ భద్రయ్య హోటల్ ముందు గల్లీలోని మూడో విద్యుత్తు స్తంభానికి చెందిన వీధి దీపం గత కొన్ని నెలలుగా వెలగడం లేదు. వెంటనే తగు చర్యలు తీసుకోండి. - **శ్రీనివాస్**

✔ వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - **రాంజీ, రామగుండం నగరపాలక ఏఈ**

రహదారిపై గుంత పూడ్చివేత

ఈనాడు స్పందనకు వందనం

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్-పెంచికల్‌పేట దారిలో ఏర్పడిన గుంతను అధికారులు సోమవారం పూడ్చివేశారు. ఈ గుంతపై ఈనాడులో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారిపై ఏర్పడిన గుంతను మట్టితో పూడ్చివేశారు.

నేర వార్తలు

వివాహిత బలవన్మరణం

పాలకుర్తి, న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. స్థానిక ఎస్సై స్వామి కథనం మేరకు.. బసంత్‌నగర్‌లో నివసిస్తున్న చిట్టిమల్ల చైతన్య (40) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం రాత్రి గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి భర్త కేశోరాం సిమెంట్ కర్మాగారంలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంటి ముందు ఉంచిన ఆటో చోరీ

ఓదెల, న్యూస్‌టుడే: ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో చోరీకి గురైన ఘటన ఓదెల మండలంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని కొలనూరు రైల్వేస్టేషన్ కాలనీకి చెందిన గట్టు సదయ్య ఆటో నడుపుకొంటూ జీవిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం పొద్దంతా నడిపి రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచాడు. తెల్లారి లేచి చూసే సరికి ఆటో లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

5 కిలోల గంజాయి పట్టివేత



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఏసీపీ రమేశ్

గోదావరిఖని, న్యూస్‌టుడే: 5 కిలోల గంజాయి తరలిస్తుండగా.. గోదావరిఖని పట్టణంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఏసీపీ రమేశ్ వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణా చేసే అవినాష్‌పై ఏప్రిల్‌లో కేసు నమోదు కాగా.. అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. సోమవారం ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రకు వెళుతున్నాడనే పక్కా సమాచారం మేరకు గోదావరిఖనిలో గంజాయితో సహా పట్టుకున్నామన్నారు. కీలకంగా వ్యవహరించిన సీఐ ఇంద్రసేనారెడ్డి, సిబ్బందికి నగదు పురస్కారాలు అందజేశారు.

పశువుల వాహనాలు...

సిర్పూర్(టి): రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 20 పశువులను పట్టుకున్నట్టు ఎస్సై కమలాకర్ తెలిపారు. కౌటాల మార్కెట్ నుంచి పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి గ్రామానికి ఎద్దులను ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్సై వెంకట్రావ్‌పేట్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. జూలపల్లికి చెందిన మూడపల్లి స్వామి, గుంటి ఐలయ్య, ఆషాడపు ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ నెలలో మొత్తం 8 వ్యాన్లను, ఒక బొలేరో వాహనాలను స్వాధీనం చేసుకొని, 126 పశువులను కాపాడినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఒప్పంద ఉద్యోగికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఒప్పంద ఉద్యోగి తీవ్ర గాయాలపాలైన ఘటన కాల్వశ్రీరాంపూర్ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మీర్జంపేటకు చెందిన పలువురు రైతులు విద్యుత్తు నియంత్రిక వద్ద ఫ్యూజ్ తీగ పోయిందని.. మోటార్లు నడవడం లేదని సంబంధిత ఉద్యోగికి సమాచారం ఇచ్చారు. దీంతో ఎన్పీడీసీఎల్ ఉద్యోగి ఆదేశం మేరకు ఒప్పంద ఉద్యోగి తోట రమేష్ నియంత్రిక వద్ద ఫ్యూజ్ తీగ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో రమేష్‌కు తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. రైతులు వెంటనే బాధితుడిని వరంగల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రమేష్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పోలీసుల నిర్బంధ తనిఖీలు

పాలకుర్తి(అంతర్గాం): మండలంలోని రాయదండిలో అంతర్గాం ఎస్సై వెంకటస్వామి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం నిర్బంధ తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

మంథని, న్యూస్‌టుడే: మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. విద్యార్థినిలు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి కళాశాలలో ఆడిపాడారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి, కళాశాల ప్రిన్సిపల్ జైకిషన్ ఓజా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మారం: ధర్మారంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఇళ్ల నుంచి తీసుకువచ్చిన పూలతో బతుకమ్మలను పేర్చారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఆడిపాడారు. కరస్పాండెట్ పుస్కూరి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బతుకమ్మతో పుర ఛైర్‌పర్సన్ రమాదేవి, చిత్రంలో కళాశాల ప్రిన్సిపల్


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీఈటీ

ధర్మారం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ముగ్గురు ధర్మారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. గత నెల 28న కరీంనగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పెద్దపల్లి జట్టు తరపున ఆడిన టి.మనోజ్ఞ, ఆర్.పవిత్ర, ఆర్.సిరి ప్రతిభ చాటి.. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 9 వరకు మెదక్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైనా విద్యార్థులను పీఈటీలు కొమురయ్య, సంజీవరావు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు

మంథని, న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలోని గౌతమినగర్ ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు శ్యామలను విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. 2013 నుంచి పాఠశాలలో సేవలు అందించిన శ్యామలను స్థానికులు అభినందించారు. ఉపాధ్యాయులు సంతోష్, రమేష్, రజితలు పాల్గొన్నారు.

శేష జీవితం సంతోషంగా గడపాలి


కేవీరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ పొందిన జీఎం కె.వి.రావును ఆర్జీ-1 కార్యాలయంలో సోమవారం సన్మానించారు. శేష జీవితంలో మరింత సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అధికారులు చంద్రశేఖర్, కిరణ్‌బాబు, హన్మంతరావు, గుర్తింపు, అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

ఏఎల్‌పీ గని సందర్శన

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సింగరేణి కార్పొరేట్ కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ విభాగ అధికారి డీవీ సుబ్రహ్మణ్యం సోమవారం అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించారు. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావుతో పాటు ఇతర అధికారులతో సమీక్షించారు. గని 3వ సీమ్‌కు సంబంధించిన వివిధ పనుల అనుమతులు, ఇతర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

వృత్తి కోర్సుల శిక్షణ

గోదావరిఖని: సింగరేణి సామాజిక బాధ్యత ద్వారా వివిధ వృత్తుల్లో చేపట్టనున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు సేవా అధ్యక్షురాలు అనిత వెల్లడించారు. సింగరేణి సేవా భవన్‌లో ఉదయం టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని ఎంవీటీసీలో 48 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న డిపెండెంట్లకు సోమవారం జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సూపర్‌వైజర్ల ఆదేశాలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతతో విధులు నిర్వహించాలన్నారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, సివిల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, జూనియర్ అసిస్టెంట్ క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో జిల్లాకు ఒనగూరిందేంలేదు

● ఎమ్మెల్యే విజయరమణారావు


పెద్దపల్లి: గోదాము శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే తదితరులు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది.. కూల్చింది భారాసనేనని, దీంతో రూ.లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. సోమవారం జరిగిన సుల్తానాబాద్ పీఏసీఎస్ 129వ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పెద్దపల్లి జిల్లాకు ఒనగూరింది ఏమీ లేదని.. ఈ ప్రాంతపు సాగునీటిని కేసీఆర్ తన నియోజకవర్గానికి, ఫాంహౌస్‌కు తరలించుకుపోయాడన్నారు. నియోజకవర్గంలో గత పాలకుల హయాంలో ధాన్యం తూకంలో అధిక మొత్తంలో కోతలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాస్, పుర ఛైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ సమత, కౌన్సిలర్లు, జిల్లా సహకారశాఖ అధికారి రాంమోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సీఈవో సంతోష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి: మండలంలోని కనగర్తిలో అప్పన్నపేట సహకార సంఘం నిర్మించిన గోదాంను రాష్ట్ర సహకార సంఘం అపెక్స్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో గోదాంలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన అయిదురోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామన్నారు. సహకార సంఘం ఛైర్మన్ సంపత్, నాయకులు రాంమూర్తి, రాజేందర్, శంకర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఓదెల: మండల కేంద్రంలో సోమవారం కాటమయ్య రక్షణ కవచం(సేఫ్టీ కిట్ల) పంపిణీ.. శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని మాట్లాడారు. గౌడ సోదరులు శిక్షణ తీసుకుని రక్షణ కవచాల సాయంతోనే చెట్లు ఎక్కాలని కోరారు. ప్యాక్స్ ఛైర్మన్ సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అన్నయ్యగౌడ్, ప్రేంసాగర్‌రెడ్డి, ఐలయ్య, రవి, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లిస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. మండలంలోని చిన్నకల్వల పీఏసీఎస్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన అనంతరం సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మియాపూర్‌లో రూర్బన్ నిధులు రూ.17.50లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. సంఘం ఛైర్మన్ మోహన్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సీఈవో రమేశ్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో స్వచ్ఛతాహీ సేవా

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ఇల్లు, పరిసరాలు, కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ దుర్గం గణేశ్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు పరిసరాలు శుభ్రం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, రమేశ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఈకి ఘన సన్మానం

గోదావరిఖని: సాగునీటి పారుదల శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించిన సూపరింటెండెంట్ ఇంజినీర్ ముస్త్యాల కరుణాకర్‌ను తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సోమవారం రాత్రి గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తోటి ఉద్యోగులు ఆయనను సత్కరించారు. నీటిపారుదల శాఖకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈఈలు తిరుపతిరావు, యాదగిరి, సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


విరమణ సమావేశంలో పాల్గొన్న సహచర ఉద్యోగులు

కేంద్ర సహాయ మంత్రికి వినతి

ఓదెల, న్యూస్‌టుడే: మండలంలోని జీలకుంటలో ప్రభుత్వ భూమిలో గణపతి, దుర్గామాత ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకున్న మండపాన్ని గ్రామానికి చెందిన ఆకునూరి రాజయ్య కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని స్థానిక నాయకులు సోమవారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారు. మండపాన్ని కూల్చకుండా అడ్డుకోవాలని కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు జలపతి, నాయకులు తిరుపతి, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

పెద్దపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షన్-2024, స్వచ్ఛతా హీ సేవా, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చెత్తను బయోమైనింగ్ చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిరోజు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది డంపింగ్ యార్డుకు తరలించే విధానం, అనంతరం యంత్రం ద్వారా సెగ్రిగేషన్ చేసే విధానాన్ని.. కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ విద్యార్థులకు వివరించారు. ట్రినిటీ డిగ్రీ కళాశాల విద్యార్థులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ రైస్‌మిల్లు నిర్మాణానికి తీర్మానం

మంథని: మంథని సహకార సంఘం ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, నాగారం శివారులో రైస్‌మిల్లు, సంఘం భవనంపై మరో అంతస్తు నిర్మించాలని సోమవారం మంథనిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘం సభ్యులు తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘం మాజీ అధ్యక్షుడు, కేడీసీసీ ఉపాధ్యక్షుడు సత్యనారయణ రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, డైరెక్టర్లు రాజబాపు, ప్రభాకర్, పోచం, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మి, మాధవి, విజయకుమార్, కార్యనిర్వణాధికారి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

■ రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్

ముత్తారం: ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని భారాస నాయకుడు, ముత్తారం మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి సోమవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మంగళవారం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

■ కమాన్‌పూర్ కార్యదర్శిగా రాజ్‌కుమార్

కమాన్‌పూర్: కమాన్‌పూర్ కార్యదర్శిగా రాజ్‌కుమార్.. పెంచికల్‌పేట కార్యదర్శిగా తిరుపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కమాన్‌పూర్ కార్యదర్శిగా పని చేసిన తిరుపతిని పెంచికల్‌పేటకు, అక్కడ పనిచేస్తున్న రాజ్‌కుమార్‌ను కమాన్‌పూర్‌కు కలెక్టర్ శ్రీహర్ష ఇటీవల బదిలీ చేశారు.

■ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని వినతి

ఓదెల: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరుతూ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్యయాదవ్ సోమవారం కరీంనగర్‌లో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీపి కబురు అందించనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. సంఘం నాయకులు కుమారస్వామి తదితరులున్నారు.

■ విద్యార్థులకు భోజన ప్లేట్లు వితరణ

జూలపల్లి: మండలంలోని కాచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక స్వచ్ఛంద సేవకుడు తాటిపెల్లి సత్తయ్య సోమవారం భోజన ప్లేట్లు, గ్లాసులు వితరణ చేశారు. ప్రతి రోజు ఇంటి నుంచి ప్లేట్లు తెచ్చుకోవడం విద్యార్థులకు ఇబ్బందిగా ఉండటంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్లేట్లు, గ్లాసులు పాఠశాలకు ఇవ్వాలని ఆగస్టు 15న గ్రామస్థులను కోరారు. సత్తయ్య స్పందించి 60 ప్లేట్లు, 60 గ్లాసులు విద్యార్థులకు సోమవారం అందజేశారు.

■ మంత్రికి ఎమ్మెల్యే పరామర్శ

గోదావరిఖని: రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి మరణించడంతో ఆయనను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే దంపతులు.. పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

■ నల్లబ్యాడ్జీలతో నిరసన

గోదావరిఖని: సింగరేణిలో అమలు చేస్తున్న ఎన్ మైనస్ వన్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ.. హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి ప్రాంతీయ ఆసుపత్రిలో ఉద్యోగులకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు నారాయణ, రాంచందర్, రాజేశ్, కుమారస్వామి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

■ నేడు ఎన్టీపీసీలో రక్తదాన శిబిరం

గోదావరిఖని పట్టణం: జాతీయ స్వచ్ఛంధ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీలోని ధన్వంతరి ఆసుపత్రి ఐసోలేషన్ వార్డులో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. వివిధ విభాగాల్లోని సుమారు వంద మంది ఉద్యోగులు రక్తదానం చేయనున్నారు.

■ హామీలు అమలు చేయాలి

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ భగత్‌సింగ్ కాలనీలో సోమవారం మాట్లాడుతూ.. చాలామంది నిరుపేదలు సొంతిల్లు, రహదారి సౌకర్యం, విద్యుత్తు సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పుష్ప, రామాచారి, గీతాంజలి, మహాలక్ష్మి, సరిత, సారమ్మ పాల్గొన్నారు.

■ 'వేస్ట్ టు ఆర్ట్' ప్రదర్శన

గోదావరిఖని పట్టణం: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరపాలక కార్యాలయంలో సోమవారం 'వేస్ట్ టు ఆర్ట్' వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. వ్యర్థాల నుంచి తయారు చేసిన వస్తువులు పలువురిని ఆకట్టుకున్నాయి. పారిశుద్ధ్య పర్యవేక్షకులు నాగభూషణం, ఆరోగ్య సహాయకులు సునీల్‌రాథోడ్, పర్యావరణ ఇంజినీర్ మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

■ గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో

ముత్తారం: మండలంలోని హరిపురం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముత్తారం ఎంపీడీవో సురేష్ సోమవారం సందర్శించి రిజిష్టర్లను తనిఖీ చేశారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి, సిబ్బందికి సూచించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

■ కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన

ధర్మారం: ధర్మారం కేజీబీవీ విద్యార్థినులకు మహిళలపై నేరాల నివారణ.. జాగ్రత్తల గురించి షీ టీం ప్రతినిధులు సోమవారం అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో జరిగే వేధింపుల గురించి వివరించారు. వేధింపులకు గురైనప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆన్‌లైన్ గేమ్‌లు, యాప్‌ల జోలికి వెళ్లకూడదని సూచించారు. ఆన్‌లైన్ మోసాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. షీ టీం ఏఎస్సై మల్లన్న, స్నేహలత, సురేష్, కేజీబీవీ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

■ పోలీసుల ఆధ్వర్యంలో..

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): రామగిరి మండలం పన్నూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం మంథని సీఐ రాజు విద్యార్థినులకు సైబర్ నేరాలు, వాట్సప్, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న సమయంలో 100 నంబర్ డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరం జరిగినప్పుడు 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. రామగిరి ఎస్సై చంద్రకుమార్ పాల్గొన్నారు.

■ కళా బృందం ఆధ్వర్యంలో..

మంథని గ్రామీణం: మండలంలోని వెంకటాపూర్‌లో సోమవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలు, ఆత్మహత్యలు, సైబర్ నేరాలు, షీటీం తదితర వాటిపై పాటలు, నాటకాల ద్వారా అవగాహన కల్పించారు. మంథని సీఐ రాజు, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

■ గుండెజబ్బులపై..

యైటింక్లయిన్‌కాలనీ: గుండె సంబంధిత సమస్యలపై సోమవారం కాలనీలోని సెక్టార్-3 డిస్పెన్సరీ ఆవరణలో డాక్టర్ పద్మ అవగాహన సదస్సు నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యలున్నవారు ఏడాది కొకసారి పరీక్షలు చేసుకోవాలన్నారు.

■ తిరుమల లడ్డూ కల్తీ ఘటనపై వీహెచ్‌పీ నిరసన

పెద్దపల్లి: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగ ఘటనపై విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జెండాకూడలిలో వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు మాట్లాడుతూ.. హిందూ ఆలయాలపై పాలకుల పెత్తనం లేకుండా స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, స్థానిక నాయకులు స్వరూప్‌కిరణ్‌గౌడ్, మల్యాల సత్యం, భజరంగ్‌దల్ జిల్లా కన్వీనర్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.